ఊరిస్తున్నాయి.. ఉసూరుమనిపిస్తున్నాయ్

- తగ్గుతున్న టమాటా ధరలు
- మార్కెట్లో కిలో టమాటా రూ.10
- బయట రాష్ట్రాల్లో దిగుబడితో ధరల క్షీణింపు
- అనంతపురం జిల్లా నుంచి భారీగా వస్తున్న టమాటాలు
- లబోదిబో మంటున్న టమాటా రైతులు


మార్కెట్‌యార్డులో టామాటా వేలం పాట నిర్వహిస్తున్న వ్యాపారులు


రవాణాకు సిద్ధంగా ఉంచిన టమాటాలు

గుర్రంకొండ: టమాటా ధరలు రైతులను ఊరిస్తూ.. ఉసూరుమనిపిస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో కిలో రూ. రూ.10కు ధర పడిపోయింది. దీంతో రైతులు లబోదిబో మంటున్నారు. బయటరాష్ట్రాల్లో టమాటా దిగుబడులు వస్తుండడంతో అక్కడి వ్యాపారులు మన జిల్లాకు రావడంలేదు. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు తోటలు దెబ్బతిని దిగుబడి తగ్గు ముఖం పడుతోంది. జిల్లాలో పడమటి ప్రాంతాల్లోని పీలేరు. కలికిరి, వాల్మీకీపురం, మదనపల్లె, అంగళ్లు, ములకలచెరువు మార్కెట్‌యార్డు పరిధిలోని ప్రస్తుతం 26వేల ఎకరాల్లో టమాటా పంట దిగుబడి వస్తోంది. రాయలసీమ జిల్లాలైన అనంతరపుం, శ్రీసత్యసాయి జిల్లాలో కూడా ప్రస్తుతం టమాటా దిగుబడులు వస్తుండడంతో మన జిల్లా మార్కెట్లలో టమాటా ధరలు రోజుకు రోజుకు పతనమవుతుండడం గమనార్హం.

26 వేల ఎకరాల్లో ప్రస్తుత పంట దిగుబడి

జిల్లాలోని పడమటి మండలాల పరిధిల్లో ప్రస్తుతం 26 వేల ఎకరాల్లో టమాటా దిగుబడి వస్తోంది. ప్రతి ఏడాది ఈసీజన్‌లో 40 వేల నుంచి 54వేల ఎకరాల్లో టమాటా పంట దిగుబడి వచ్చేది. ఇటీవల కురిసిన వర్షాలకు టమాటా తోటలు బాగా దెబ్బతిన్నాయి. దీంతో టమాటా పంట దిగుబడి ఈనెలలో అత్యల్పంగా వస్తోంది. గత ఏడాది ఇదే సీజన్‌లో అత్యధికంగా 56 వేలఎకరాల్లో టమాటా పంట దిగుబడి వచ్చింది. ఈ ఏడాది ఈసీజన్‌లో 26 ఎకరాల్లోనే టమాటా పంట దిగుబడి వస్తుండడం గమనార్హం.

రోజురోజుకు ధర తగ్గుదల

మార్కెట్లో టమాటా ధరలు రోజురోజుకు తగ్గిపోతున్నాయి. గత 20 రోజుల క్రితం ఉన్న టమటా ధరలతో పోల్చుకుంటే ప్రస్తుతం 65 శాతం మేరకు ధరలు తగ్గిపోవడం గమనార్హం.. 20 రోజులు కిందట 25 కేజిల టమాటా క్రేట్ ధరలు అత్యధికంగా రూ.650 నుంచి రూ.800 వరకు ధరలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం ఒక క్రేట్ ధర రూ. 250 వరకు ధరలు పలుకుతున్నాయి. వారం రోజులుగా మార్కెట్లో టమాటా ధరలు రోజు రోజుకు తగ్గిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్లో ఇవే ధరలు కొనసాగితే కనీసం పంట సాగుకు ఖర్చు చేసిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి ఉండదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మార్కెట్‌కు వచ్చిన టమాటాలు, ధర

తేదీ	ధరలు (25 కేజీల క్రేట్)
ఆగస్టు 31	రూ. 550
సెప్టెంబర్ 01	రూ. 600
సెప్టెంబర్ 02	రూ. 550
సెప్టెంబర్ 03	రూ. 450
సెప్టెంబర్ 04	రూ. 400
సెప్టెంబర్ 05	రూ. 350
సెప్టెంబర్ 06	రూ. 250

వర్షాలకు దెబ్బతిన్న తోటలు

ఇటీవల కొన్ని రోజులు పాటు కురిసినవర్షాలకు, మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా జిల్లాలో టమాటా తోటలు భారీగా దెబ్బతిన్నాయి. జిల్లాలో పలుచోట్ల కురిసిన చెదరుమొదురు వర్షాలకు చెట్టుల్లో కాయల దెబ్బతింటున్నాయి. పూత, పిందె గతంతో పోల్చితే 50 శాతం కూడా నిలబడడం లేదు. కాయలు కూడా త్వరగా రంగుతేలిపోవడంతో పాటు పలుచోట్ల టమటాలపై మచ్చలు వస్తున్నాయి. దీంతో పంట దిగుబడి గతంతో పోల్చుకొంటే 35 శాతం మేరకు తగ్గిపోయింది. ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో పాటు పంట దిగుబడి తగ్గిపోతుండడంతో రైతులు అందోళన చెందుతున్నారు.

రాయలసీమ జిల్లాలో దిగుబడి ఎక్కువ

బయట రాష్ట్రాలతో పాటు రాయలసీమ జిల్లాలో టమాటా దిగుబడి నిలకడ వస్తుండడంతో ఇక్కడి టమాటా ధరలు రోజురోజుకు పతనమవుతున్నాయని వ్యాపార వర్గాలు అంటున్నాయి. చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్‌తోపాటు రాయలసీమ జిల్లాలైన అనంతరపుం.శ్రీసత్యసాయి జిల్లాలో టమాటా దిగుబడులు ప్రారంభమయ్యాయి. ప్రతిరోజు ఆయా జిల్లాల నుంచి పెద్ద ఎత్తున టమాటాలు మన జిల్లాలోని టమాటా మండీలకు వస్తున్నాయి. దీని ప్రభావం మన జిల్లాలోని టమాటా ధరలపై బాగా పడుతోందని రైతులు అంటున్నారు.

ప్రభుత్వం వైపు టమాటా రైతుల చూపు:

మార్కెట్లో టమాటా ధరలు అత్యధికంగా పలుకుతున్నప్పుడు ధరలు తగ్గించి విక్రయించాలని మార్కెట్ అధికారులను ఆదేశించే ప్రభుత్వం నేడు తమను ఆదుకోవాలని టమాటా రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



రోజురోజుకు టమాటా ధరలు తగ్గిపోతుండడం ఆందోళనకరంగా ఉంది. 20 రోజుల క్రితం టమాటా ధరలు బాగున్నాయి. మార్కెట్లో 25 కేజిల క్రేట్ ధర రు. 800 నుంచి రూ.900 వరకు ధరలు పలికాయి. వారం రోజులుగా టమాటా ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. ప్రస్తుతం సరాసరి ఒక క్రేట్ ధర రూ.250 వరకు మాత్రమే ధరలు పలుకుతుండడంతో రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వమే టమాటా రైతుల్ని ఆదుకోవాలి.

– నరసింహులు, రైతు, గంగిరెడ్డిపల్లె

ధరలు తగ్గుముఖం పట్టాయి



మార్కెట్లో టమాటా ధరలు రోజురోజుకు తగ్గుముఖం పడుతున్నాయి. బయట రాష్ట్రా ల్లో తో పాటు మన రాష్ట్రంలోని పలు జిల్లాల్లో టమాటా దిగుబడులు మొదలయ్యాయి. దీంతో బయటరాష్ట్రాల వ్యాపారులు జిల్లాకు రావడంలేదు. దీంతో ధరలు ఆశించినంతగా పెరగడం లేదు. వారంరోజులుగా మార్కెట్లలో టమాటా ధరలు తగ్గిపోతున్నాయి. వర్షాలకు ఇక్కడి టమాటా తోటలు దెబ్బతిన్నాయి.

– కుమార్‌రెడ్డి, కార్యదర్శి, వాల్మీకిపురం మార్కెట్ కమిటీ

క్లుప్తంగా

నేడు ఆలయాలు మూసివేత

మదనపల్లె సిటీ: సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం ఉదయం 11 గంటల నుంచి ఆలయాలు మూసివేయనున్నట్లు యోగభోగేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు విశ్వేశ్వర ప్రసాద్ తెలిపారు. మరుసటి రోజు ఉదయం ఆలయాల్లో సంప్రోక్షణ చేసి తరువాత భక్తులకు పునః దర్శనం కల్పిస్తామని తెలిపారు.

మంత్రి పర్యటనపై నిరసన

మదనపల్లె: వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మదనపల్లె పర్యటనపై బీఎస్పీ నాయకులు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. శనివారం మంత్రి బెంగళూరు వెళ్తూ మదనపల్లెలో నిర్వహించిన బీజేపీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మదనపల్లె వైద్య కళాశాలను ప్రయివేటుకు ఇవ్వొద్దంటూ ప్లకార్డులు ప్రదర్శించి పార్టీ కార్యాలయంలో నిరసన తెలిపారు. మంత్రి రాజకీయ ఎదుగుదలకు కారణమైన మదనపల్లెకు ప్రభుత్వ ఆధ్వర్యంలోనే వైద్య కళాశాల కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శివ, బాలాజీ, మహేష్, ప్రశాంత్, మణీ, బాబు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

కురబలకోట: బాల్య వివాహాలు నేరమని ఐసీడీఎస్ స్థానిక సీడీపీఓ సుజాత అన్నారు. ముదివేడు జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు జరిగిన అవగాహన సమావేశంలో మాట్లాడుతూ బాల్య వివాహాలు హక్కుల హరణమన్నారు. వీటిని అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. భవిష్యత్తు బలి అవుతుందన్నారు. ఆరోగ్యం, విద్య, మానసిక పరిపక్వత అన్నింటికి ఆటంకం కలిగిస్తాయన్నారు.

మాజీ వైస్ ఎంపీపీ మృతికి సంతాపం

రామసముద్రం: మండలం మాజీ వైస్ ఎంపీపీ గుండ్లపల్లికి చెందిన రామకృష్ణారెడ్డి(81) శనివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మూగవాడి పంచాయతీ ఏకగ్రీవ సర్పంచ్గా 1974నుంచి 1989 వరకు 15ఏళ్ల పాటు కొనసాగారు. అనంతరం 2000 నుంచి 2005 వరకు మండల వైస్ ఎంపీపీగా పనిచేశారు. ఆయన మృతికి పార్టీలకు అతీతంగా సంతాపం వ్యక్తం చేశారు.

విద్యార్థుల సంఖ్యను పెంచాలి

తంబళ్లపల్లె: స్థానిక ప్రభుత్వ గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఆల్ ఇండియా ఎరుకుల హక్కుల పోరాట సమితి జాతీయ కమిటీ సభ్యులు అమావాస్య రమణ అన్నారు. శనివారం స్థానిక గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో సమావేశం నిర్వహించారు. పదో తరగతికి సైన్స్, ఇంగ్లీషు టీచర్ లేరని, దీని వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 150 మంది విద్యార్థులు ఉండాల్సి ఉండగా కేవలం 45 మంది విద్యార్థులున్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. మండల నాయకులు రఘుపతి,రెడ్డయ్య పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ


నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల

కలికిరి(వాల్మీకిపురం): వాల్మీకిపురం మండలంలోని అయ్యవారిపల్లి గ్రామం చిన్నగంగువారిపల్లికి చెందిన మిట్టపల్లి చంద్రశేఖర్ రెడ్డి కుమారుడు చక్రపాణి రెడ్డి మృతి చెందిన విషయం తెలిసి పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి శనివారం ఉదయం మృతదేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అలాగే జర్రావారిపల్లి పంచాయతీ ఈతచెట్లవాండ్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతపర్తి చిన్నరెడ్డెప్ప రెడ్డి మృతి సమాచారంతో వారికి స్వగృహానికి వెళ్లి చిన్నరెడ్డెప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

మదనపల్లె సిటీ: అనారోగ్యంతో ఓ యువకుడు మృతి చెందడంతో రక్తసంబంధికులు, కుటుంబసభ్యులు ఎవరూ ముందుకు రాకపోవడంతో హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు మేమున్నామంటూ మానవత్వం చాటారు. పట్టణంలో చిత్తుకాగితాలు ఏరుకుని జీవించే ఓ యువకుడు స్థానిక ఇందిరానగర్‌లో మృతి చెందడంతో మృతదేహాన్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి మార్చురీ గదిలో ఉంచారు. అంత్యక్రియలు నిర్వహించడానికి ఎవరూ రాకపోవడంతో టు టౌన్ పోలీసులు హెల్పింగ్‌మైండ్స్ సభ్యులకు సమాచారం అందించారు. మృతి చెందిన యువకుడు ముస్లిం కావడంతో ఇస్లాం సంప్రదాయప్రకారం శనివారం స్థానిక ఖబ్రస్తాన్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమలో హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్దిక్, సభ్యులు యూసుఫ్, ఆనంద్, ఫయాజ్, గౌస్, నవీన్, గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత

కలకడ : బాలికల సంరక్షణ అందరి బాధ్యత అని సీడీపీఓ రాజమ్మ అన్నారు. శనివారం మండలంలోని కె.బాటవారిపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మాట్లాడారు. బాలికల సంరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, వారి సంరక్షణకు తీసుకుంటున్న పథకాలను వివరించారు. వన్‌స్టాప్ మన్నిలా, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు శాంత, యశోద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో కూటమి ప్రభుత్వం విఫలం


పోస్టుకార్డులతో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కేవీపల్లె : యూరియా సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుండ్లూరు జయరామచంద్రయ్య అన్నారు. శనివారం కేవీపల్లెలో ప్రభుత్వానికి పోస్టుకార్డులు పంపి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎంతో కష్టపడి వరినాట్లు వేయడం తోపాటు ఇతర పంటలు సాగు చేశారని చెప్పారు. యూరియా ప్రభుత్వం సరఫరా చేయకపోవడం, వ్యాపారస్తులు బ్లాక్ మార్కెట్‌లో అధిక దరలకు విక్రయించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. యూరియా సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వక్రీకరించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి యూరియా సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దిగువగళ్ళ శ్రీనివాసులురెడ్డి, నాయకులు శ్రీనివాసులు, బి. రమేష్, సైపుల్లా, అల్తాఫ్, హర్షవర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఖాదర్‌బాషా, రామకొండారెడ్డి, కిరణ్‌నాయుడు, నాగేశ్వర, సుగుణమ్మ, చందనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురువులను ప్రతి ఒక్కరూ గౌరవించాలి


మాట్లాడుతున్న జడ్జి జియావుద్దీన్

పీలేరు రూరల్ : గురువులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జియావుద్దీన్ షేక్ అన్నారు. శనివారం పట్టణంలోని కోటపల్లె జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులకు గురుపూజోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తల్లి, తండ్రి తరువాత దైవంగా బావించే గురువే దేశానికి వెన్నుముక అని తెలిపారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు, బావితరాలకు ఉపయోగపడేవిధంగా కృషి చేయాలని కోరారు. మంచి క్రమశిక్షణ కల్గి, హక్కు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శివశంకరయ్య, ఉపాధ్యాయులు శేషాద్రిరెడ్డి, జయచంద్రారెడ్డి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సైలేజ్ విధానంతో అధిక పాలదిగుబడి


రైతులకు మినరల్ మిక్చర్ పంపిణీ చేస్తున్న అధికారులు

పీలేరు : సైలేజ్ విధానంతో తయారు చేసిన మేతను పశువులకు అందించడం ద్వారా అధిక పాలదిగుబడి పొందవచ్చునని వైశు వైద్యాధికారి డాక్టర్ రామచంద్ర అన్నారు. శనివారం మండలంలోని తలపులలో పశుపోషణ ఆవశ్యకతపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైలేజ్ విధానంలో తయారు చేసిన మేతను ఇవ్వడం ద్వారా 2 నుంచి 3 లీటర్లు పాలదిగుబడి అదనంగా వస్తుందని తెలిపారు. పాదుపు వ్యాధి రాకుండా పాలు పిండిన తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. గాలికుంటు, బొబ్బల వ్యాధి రాకుండా ముందుగా టీకాలు వేపించుకోవాలన్నారు. అనంతరం చిన్నగొట్టిగల్లు ఆత్మ ద్వారా మినరల్ మిక్చర్ ప్యాకెట్లు రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ బీటీఎం జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులు


ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న ఎంఈఓలు


ప్రోత్సాహక బహుమతి అందుకుంటున్న రెడ్డప్పరెడ్డి

నిమ్మనపల్లె : సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులని ఎంఈఓలు పద్మావతి, నారాయణ అన్నారు. శనివారం నిమ్మనపల్లెలోని మోడల్ ప్రైమరీ పాఠశాలలో హెచ్ఎం భాస్కరన్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీపీ రెడ్డప్పరెడ్డి పాల్గొనగా, గురువులను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వత్తి ఎంతో పవిత్రమైనదని, అంకితభావంతో పనిచేస్తే సమాజంలో గొప్ప మార్పు తీసుకురావచ్చన్నారు. మన పాఠశాలలో మనకు గర్వకారణమని, విద్యార్థులే మన బలం అన్నారు. కార్యక్రమంలో పి ఎం సి కమిటీ ఛైర్మన్ మమత, ఎమ్మార్సీ సిబ్బంది నరసింహులు, సౌజన్య పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

మదనపల్లె సిటీ: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి మాట్లాడుతూ అధ్యాపకులు విద్యార్థుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కాలేజీలో విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు ఉత్తమ విద్యన అందిస్తున్నారన్నారు. కార్పొరేట్ కాలేజీలకు ధీటుగా అధ్యాపకులు భోదన చేస్తున్నారన్నారు. ఎంతో మంది విద్యార్థులకు ఉన్నత స్థాయికి వెళ్లారన్నారు. అధ్యాపకుల కృషితోనే కాలేజీకి మంచి పేరుప్రఖ్యాతులు వచ్చాయన్నారు.ప్రిన్సిపాల్,విద్యార్థులు అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సాయిశంకర్‌రెడ్డి,శ్రీదేవి, రమణ, మాలతి, మురళీధర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రెడ్డప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

14న థిల్లానా మెగా ఫెస్ట్ టాలెంట్ పోటీలు

మదనపల్లె సిటీ: మదనపల్లెలో 13వ తేదీన థిల్లానా మెగా ఫెస్ట్ టాలెంట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డ్యాన్స్‌మాస్టర్ వెంకటేష్ తెలిపారు. శనివారం థిల్లానా మెగా ఫెస్ట్ పోస్టర్లను ఆవిష్కరించారు. స్థానిక నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరి కళ్యాణ మండపంలో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. ఇందులో డ్యాన్స్, సింగింగ్ , పైటింగ్, మెహందీ,షార్ట్ ఫిలిం విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్, మెడల్స్ అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశయం ఫౌండేషన్ అధ్యక్షులు గుంపు భానుప్రకాష్, సభ్యులు దిలీప్‌మిట్టా, పునీత్‌కుమార్, ఆంజి, మనోజ్, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్

రామసముద్రం : రామసముద్రం పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆటో డ్రైవర్లకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్ బాబు ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ జాగ్రత్తలు, మితమైన వేగంతో వాహనాలు నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టపరంగా చర్యలు ఉంటాయన్నారు. అలాగే ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, సమాజ పట్ల ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ఉండాలని ఆయన సూచించారు. ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని సూచించారు.

సీపీఐ నాయకుల ధర్నా

మదనపల్లె: అమెరికా సుంకాల దెబ్బకు దెబ్బతిన్న రంగాలకు చేయూత ఇవ్వాలన్న డిమాండ్‌తో శనివారం సీపీఐ నాయకులు స్థానిక వారపుసంతలోని అన్నా క్యాంటిన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణప్ప మాట్లాడుతూ సుంకాలపై కేంద్రప్రభుత్వం ప్రశ్నించలేకపోతోందన్నారు. ప్రజల ప్రయోజనాల కంటే అమెరికా ప్రయోజనాలను కాపాడుతోందని విమర్శించారు. అమెరికా పెత్తనం పక్కనపెట్టి పొరుగు దేశాలతో వాణిజ్య బంధం పెంపొందించుకోవాలని కోరారు. జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ, నియోజకవర్గ కార్యదర్శి మురళి, పట్టణ కార్యదరర్శి మాధవ్, ముబారక్ పాల్గొన్నారు.

బి.కొత్తకోట: దేశ ఎగుమతులపై అమెరికా 50 శాతం సుంకాలు విధించడాన్ని నిరసిస్తూ శనివారం బి.కొత్తకోటలో సీపీఐ శ్రేణులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక జ్యోతిచౌక్‌లో ధర్నా నిర్వహించి అమెరికాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి బషీర్‌ఖాన్, రఘునాధ్, అష్రఫల్లీ, హబీబ్, గంగులప్ప, ఖాదర్‌బాషా, సోము, రియాజ్ పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలు చేయాలి


సీడాట్ నిపుణులు ప్రదీప్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రిన్సిపాల్ రాయుడు

మదనపల్లె సిటీ: ఆధునిక కమ్యూనికేషన్‌లకు అనుగుణంగా నూతన ఆవిష్కరణలు చేయాలని సీ డాట్ నిపుణులు నారు ప్రదీప్ అన్నారు. శనివారం స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో 5 జీ, 6 జీ టెక్నాలజీల అనువర్తనాలు, కేస్ స్టడీస్‌పై టెక్నికల్ టాక్ కార్యక్రమం జరిగింది. ప్రస్తుతం కమ్యూనికేషన్ రంగంలో వస్తున్న మార్పులు, పరిశోధనలు,పరిశ్రమలకు దోహదం చేసే వాస్తవ ఉదాహరణలు వివరించారు. 5 జీ టెక్నాలజీ, ఆరోగ్య సంరక్షణ, స్మార్ట్ సిటీలు, పారిశ్రామిక ఆటోమేషన్, ఆన్‌లైన్ విద్యారంగాల్లో వేగవంతమైన మార్పులకు దారి తీస్తుందన్నారు. 6జీ టెక్నాలజీ హై స్పీడ్, హోలోగ్రాఫిక్ కమ్యూనికేషన్, ఏఐ ఆధారిత స్మార్ట్ సేవల ద్వారా మానవ జీవ ప్రమాణాలను మెరుగుపరుస్తుందన్నారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి, ప్రిన్సిపాల్ రాయుడు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఎస్ఈకి ఈఈ బాధ్యతలు

మదనపల్లె: హంద్రీ-నీవా మదనపల్లె సర్కిల్-2 ఎస్ఈ విఠల్‌ప్రసాద్‌కు ఉన్నతాధికారులు ఈఈ బాధ్యతలు అప్పగించారు. కదిరి డివిజన్-11 ఈఈగా పని చేస్తున్న నీలకంఠారెడ్డి గతనెల 31న ఉద్యోగ విరమణ చేశారు. ఈయన పుంగనూరు ఉపకాలువ కాంక్రీట్ లైనింగ్ పనుల బాధ్యతలు చూస్తున్నారు. దీనితో ఈ పోస్టులో పనిచేసేందుకు పలువురు ఈఈలు, ఇప్పటికే ఇక్కడ పని చేస్తున్న ఈఈలు ప్రయత్నాలు చేశారు. అయితే వీరికి ఎవరికి ఇవ్వకుండా ఎస్ఈ స్థాయి అధికారికి ఈఈ బాధ్యతలు అప్పగించారు. సాధారణంగా ఏ స్థాయి పోస్టుకు ఆ స్థాయి అధికారికి బాధ్యతలు అప్పగించడం జరుగుతుంది. ఇక్కడ ఎస్ఈ స్థాయి అధికారికి ఆయనకు దిగవన ఉన్న ఈఈ పోస్టు బాధ్యతలు ఇవ్వడంపైనా చర్చ జరుగుతోంది.

లోక్‌అదాలత్ విజయవంతం చేయండి

పీలేరురూరల్ : ఈ నెల 13న స్థానిక కోర్టులో నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జియావుద్దీన్ షేక్ అన్నారు. శనివారం స్థానిక ఏడీపీ కోర్టులో పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఇరువర్గాలను ఒప్పించి ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా కృషి చేయాలన్నారు. సివిల్, క్రిమినల్, మోటారు వాహనాలు కేసులు, కుటుంబ తాగాదా, చెక్‌బౌన్స్ కేసులు, బ్యాంకులు, బీఎస్ఎన్ఎల్ కేసులు పరిష్కరించుకోవచ్చునని తెలిపారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

కురబలకోట: బీజేపీ బలోపేతం చేయడానికి సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. శనివారం అంగళ్లు కూడలిలో గోల్డన్‌వ్యాలీ విద్యా సంస్థల అధినేత, క్రియాశీలక నాయకులు ఎన్వీ రమణారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సమన్వయంతో పాటుపడాలన్నారు. జాతీయ నాయకులు చల్లపల్లె నరసింహా రెడ్డి, జిల్లా అధ్యక్షులు సాయిలోకేష్, రాజారెడ్డి, గుణ శేఖర్‌రెడ్డి, కరుణాకర్ రెడ్డి, మారపరెడ్డి పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి


సమస్యలపై మాట్లాడుతున్న ఆటో డ్రైవర్లు

నిమ్మనపల్లె : స్త్రీ శక్తి పథకంతో ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ముబారక్ డిమాండ్ చేశారు. శనివారం నిమ్మనపల్లిలో ఆటో డ్రైవర్స్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే అనేక సమస్యలతో సతమతమవుతున్న ఆటో డ్రైవర్లు ప్రభుత్వం అమలు చేసిన స్త్రీ శక్తి పథకంతో మరింత నష్టపోతున్నారన్నారు. ఆటో, క్యాబ్, టాటా ఏస్ డ్రైవర్లు, కార్మికుల కుటుంబాలు నష్టపోకుండా ప్రతి డ్రైవర్ కు ఏడాదికి రూ.25 వేల చొప్పుల చెల్లించాలన్నారు. డ్రైవర్లను జైలు పాలు చేసే హిట్ అండ్ రన్ చట్టంలోని ప్రమాదకర సెక్షన్లు తొలగించాలన్నారు. ఈఎస్ఐ తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటోలకు ఎఫ్‌సీ సేవలు మదనపల్లి ఆర్టీవో కార్యాలయాలలోనే కొనసాగించేలా ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలన్నారు. పెనాల్టీలు పెంచే నోటిఫికేషన్ జీవో నెంబర్ 21 31 రద్దు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రధానమైన కూడలి లో ఆటోలకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలన్నారు. సెప్టెంబర్ 16న ఆటో డ్రైవర్ల సమస్యలపై జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ఆటో డ్రైవర్లు అందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు అస్లాం,రాత్ రెడ్డి, నరసింహ, సుధాకర్, అహ్మద్ బాషా, షాకీర్, భాస్కర్,రెడ్డి నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలోచనలను వ్యాపారంగా మలుచుకోవాలి


మాట్లాడుతున్న మహేష్ పవన్

కురబలకోట: విద్యార్థులు ఆలోచనలను వ్యాపారంగా మలచుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని బెంగళూరు ఐబీఎం కంపెనీ కింద్రిల్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ మహేష్ పవన్ అన్నారు. విద్యార్థులు ఆలోచనలను వ్యాపారంగా మలచుకోవడం ఎలా..అంశంపై అంగళ్లు మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలో శనివారం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ఆలోచనలు విలువైనవన్నారు. వీటితో అవకాశాలను సృష్టించుకోవాలన్నారు. స్టార్టప్ కల్చర్‌ను అలవర్చుకోవాలన్నారు. ఇన్నోవేషన్, ఆంత్రప్రెన్యూర్‌షిప్‌ను కలిగి ఉండాలన్నారు. సమాజ అవసరాలకు అనుగుణంగా మార్చుకుంటే ఏదైనా విజయవంతమైన వ్యాపారంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధికారులు, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ నారసింహుడికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ: ఊమండలంలోని గుర్రంకొండ, తరిగొండ గ్రామాల్లో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయాల్లో స్వామివార్లకు విశేషపూజలు నిర్వహించారు. శనివారం టీటీడీ వారి ఆధ్వర్యంలో తరిగొండ ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. గుర్రంకొండ కోటలోని నృసింహస్వామి ఆలయంలో వేకువజామేన అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకొని స్వామివార్లను సేవించుకొన్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

స్వామిత్వ సర్వే గడువులోగా పూర్తి చేయాలి

నిమ్మనపల్లె : గ్రామాలలో చేపట్టిన స్వామిత్వ సర్వే నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఎంపీడీఓ రమేష్ బాబు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో స్వామిత్వ సర్వే సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా, సర్వే నిర్వహించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శిలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.